# టెస్టు

- వై. కె. మూర్తి

కొత్తగా పెళ్ళయి ఏలూరులో కాపురం పెట్టాడు శ్రీరామ్. అప్పుడే ఇంట్లోకి అడుగుపెడుతూ "అబ్బబ్బ ఈరోజు ఎండ ఎక్కువగా వుంది" అంటూ విసుగ్గా ఫ్యాన్ స్విచ్ ఆన్‌చేసి కుర్చీలో కూలబడ్డాడు.

ఫ్యాన్ గాలికి టేబుల్ మీద వున్న ఇన్‌ల్యాండ్ లెటర్ ఎగిరి అతని ఒళ్ళో పడింది. చూడబోతే చించేసి వుంది. ఎప్పుడొచ్చిందో చూసాడు. ఇవాళే వచ్చింది. ఎక్కడనించి వచ్చిందో చూసాడు "ఫ్రమ్ సుశీల" అని వుంది. అంతే ఒక్కసారిగా చండ ప్రచండుడయ్యాడు.

"సీతా... సీతా... పెద్దగా అరిచాడు. ఏం కొంప మునిగిందో అని పరిగెత్తుకుంటూ వచ్చింది సీత. "ఈ లెటర్ ఎవరు చింపారు?" కర్కశంగా అడిగాడు శ్రీరామ్.

"నేనే" అని మెల్లగా అంది సీత. "ఛీ... ఛీ... మేనర్‌లెస్ బ్రూట్. నీకు బుద్ధి వుందా? జ్ఞానం కాస్తయినా వుందా? ఎందుకు చదువుకున్నావ్? ఇంకొకరికి వచ్చిన లెటర్ చదవకూడదనే ఇంగిత జ్ఞానం లేకపోయింది. చూడు! మనిషై పుట్టినంత మాత్రాన సరిపోదు. ప్రతి మనిషికి ఒక ప్రిన్సిపుల్ ఉండాలి. అసలు ప్రిన్సిపుల్స్ లేని మనిషి మనిషి కాదు - పశువు..." కోపం తారాస్థాయిలో ప్రదర్శిస్తున్నాడు శ్రీరామ్.

"అది కాదండి... ఏదైనా అర్జంటు మేటరేమో అని..." నీళ్ళు నమిలింది సీత.

"ఎందుకు అబద్ధాలు? ఫ్రమ్ ఎడ్రస్ సుశీల అని ఉంది. ఎవరా సుశీలా అని చించి చదివావ్ అంతేనా!"

అవునన్నట్లు తలూపింది సీత. "సుశీల ఎవరనుకున్నావే, నా కజిన్. ఎక్కడో ఆగ్రాలో వుంటోంది. అదేదో కష్టం, సుఖం లెటర్‌లో రాసుకుంటే దాన్ని నువ్వు చదువుతావా? చూడు! ఒకరి లెటర్ మరొకరు చదవటం నాకు ఇష్టం వుండదు. నీకు యిదే ఆఖరి వార్నింగ్. ఫో!!" గద్దించాడు శ్రీరామ్.

కిక్కురుమనకుండా అక్కడ నుంచి వెళ్ళిపోయింది భారతదేశపు మధ్యతరగతి గృహిణి సీత. తాపీగా లెటర్ చదవటం మొదలెట్టాడు శ్రీరామ్.

ఒకరోజు ఆఫీస్ సెలవు మూలాన ఇంట్లోనే వున్నాడు. బొత్తిగా తోచడం లేదు. భార్య విజయవాడలోని వాళ్ళ అక్కగారింటికెళ్ళి ఇంకా రెండ్రోజులన్నా కాలేదు. అయినా ఇంట్లో ఉండ బుద్ధి గావడంలేదు. మ్యాటినీకి వెడదామని బట్టలు వేసుకోవడం మొదలుపెట్టాడు. ఇంతలో 'పోస్ట్' అని వినిపించడంతో బయటికి వచ్చి కవరందుకున్నాడు. దాని మీద "సీత, W/o శ్రీరామ్" మిగతా అడ్రసు వుంది. ఫ్రమ్ ఎడ్రస్ చూసాడు "వాసు" అని వుంది. ఒక్కసారి షాక్ తగిలినట్లు ఫీల్ అయ్యాడు.

"ఎవడు ఈ వాసు! తనకు తెలిసినంతవరకు సీత బంధువుల్లో వాసు అన్నపేరు ఉన్నవాళ్ళు ఎవరూ లేరు. మరి... ఈ వాసు ఎవడు? సీత కాలేజి ఫ్రెండా? లేకపోతే బోయ్ ఫ్రెండా? వాడు ఎంత సన్నిహితుడు కాకపోతే ఇలా ఇంత ధైర్యంగా ఇంటికి లెటర్ వ్రాస్తాడు? అదృష్టం బాగుండి, ఈ టైమ్‌కి తను ఇంట్లో ఉండబట్టి అసలు సంగతి తెలిసింది. ఎన్నాళ్ళనించి ఇలా సాగుతోందో?" ఒక్కసారిగా వెర్రికోపం ముంచుకొచ్చింది. చకచకా కవరు చింపి చదవడం మొదలుపెట్టాడు శ్రీరామ్.

"శ్రీవార్కి నమస్కారం. మీ "ప్రిన్సిపుల్" ఎంత సిన్సియర్‌గా ఉంటుందో చూడటానికి ఇది ఒక చిన్న టెస్టు. కాని, పాపం! ఈ టెస్టులో పాస్ అవలేకపోయారు. ఏమీ బాధపడకండి. ఇక నుంచి మీ ప్రిన్సిపుల్ ఖచ్చితంగా అమలుపర్చటానికి ప్రయత్నం చెయ్యండి. మీ ప్రయత్నం దిగ్విజయంగా నెరవేరాలని ఇక్కడ అమ్మ వారికి మీ పేర అభిషేకం చేయిస్తాను. మరి ఉండనా?

ఇట్లు

మీ శ్రీమతి సీత

లెటర్ చదువుతున్న వాడు, చదువుతున్నట్టే మూర్ఛపోయాడు పాపం శ్రీరామ్. ○